# దీక్ష

ఈశ్వర్

ఇప్పటివరకూ రెండో పెండ్లి అంటే ఎగిరి మీదపడే మామయ్య ఆరోజు తెనాలి సంబంధం చెప్పేసరికి "పెళ్లి పిల్లను చూచిరండి. మీకు నచ్చితే తర్వాత నేను చూస్తాను" అని అన్నాడు. ఏ సంబంధము చూచినా యీ పిల్ల నల్లగా ఉందనో, లేకపోతే ఈ అమ్మాయి చదువుకో లేదనో, ఈ అమ్మాయి పొడుగ్గా ఉందనో, పొట్టిగా ఉందనో సాకులు చెప్పే మామయ్య ఆ రోజు తెనాలి సంబంధం ఒప్పుకున్నాడంటే (కనీసం చూడడానికైనా) నాకేకాదు మాయింట్లో ఉన్నవాళ్ళందరికీ ఆశ్చర్యం కలిగించింది.

మామయ్య మొదటి భార్య చనిపోయిసుమారు పదిసంవత్సరాలు కావస్తున్నాయ్. ఈపదిసంవత్స రాలలో అతడికి వచ్చిన సంబంధాలు లెక్క పెట్ట టానికికూడా ఒక్కొక్కప్పుడు అసాధ్యమయ్యేది మా తాతగారు మామయ్యతో "నాయనా సంబం ధాలు చాలావస్తున్నాయి, నీవు అన్నిటినీ వద్దంటే ఎట్లాగురా? ఏదో ఒక మంచి సంబంధం చూచి సెటిల్ చేసుకోవాలిగాని —'' అని అనేవారు ప్రతిసారి. ఎంతచెప్పినా మామయ్య "ఇప్పుడు కాదులేండి. నెమ్మదిగా చూచుకోవచ్చు" అని సమాధాన పరచేవాడు. ఒక్కొక్కప్పుడు మా తాతగారు నాతో "ఇంక వాడికి పెళ్లయ్యే గీతలేదురా, ఆ జన్మాంతం బ్రహ్మచారిలాగ ఉండిపోతాడు. ఇంతకూ మేము చేసుకున్న ప్రారబ్ధం" అని అంటూండేవారు,

ఇంతగా మామయ్య రెండోపెళ్లి చేసుకోననే దీక్ష వహించటానికి మొదటి భార్య ఏమైనా రంభలాగ అందంగా ఉంటుందా అంటే అదీ లేదు. చామనచాయ రంగుతో పల్లెటూరి వాళ్లలాగ మోటుగా ఉంటుంది, ముఖముకూడ ఏమంత అందముగా ఉండదు కాని మామయ్య పెళ్లిచే సుకోపోవడానికి ఒక కారణం చెప్పొచ్చు. మొదటి భార్య కాపరానికి వచ్చింది మొదలు ఆమెకు ఎ. బి సి ల నుంచి మెట్రిక్యులేషన్ పరీక్షకు అప్పియర్ అయ్యే వరకు చదువు తనంతట తనే స్వయంగా నేర్పాడు వచ్చే మార్చిలో మెట్రిక్ పరీక్షకు కూర్చోపెడుదామని అనుకొంటుండగా సెప్టెంబరులోనో, అక్టోబరు లోనో ఆమె చనిపోయింది. దానితో మామయ్య పడ్డకష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయింది. మామయ్య మనస్సు పూర్తిగా చెడిపోయింది. ఇదికాకుండా మొదటి భార్యవల్ల కలిగిన అన్యోన్య ప్రేమ మరొక స్త్రీతో కలగదని మామయ్య అను మానం. అప్పటినుంచీ వివాహప్రసక్తివస్తే మామయ్య అక్కడినుంచే లేచిపోతాడు,

అట్లా ఉండే మనిషి ఇప్పుడు రెండో పెళ్లి చేసుకోటానికి ఎట్లా ఒప్పుకున్నాడా? అనేది పెద్ద సమస్య

మామయ్య చాలా మాట పట్టింపు మనిషి, ఎప్పుడైనా ఏమాటయైనా అన్నాడంటే, అవని పూర్తి అయ్యేవరకూ నిద్రపోడు. అబద్ధాలు మాట్లాడేవారివి, మనిషి దగ్గర మనిషి మాటలు

చెప్పేవారిని చూస్తే మామయ్యకు వచ్చేకోపం. ఇంతో అంతో కాదు అటువంటి వాళ్లతో మాట్లాడదుసరికదా పైగా చీదరించుకుంటాడు.మామయ్య అప్పుడప్పుడు మాయింటికి వచ్చి "మా హేడ్ మాస్టరుఉత్తఅబద్ధాలకోరు"నిచెప్పేవాడు (మామయ్య స్కూలు మాసరు లెండి) నిజంచెప్పాలంటే ఈమాట పట్టింపే అతని రెండో పెళ్లికి చేయూతనిచ్చిందని చెప్పాలి.

ఒకసారి అకస్మాతుగా మా అమ్మమ్మకు పెద్ద జబ్బు చేసింది. మాఅమ్మమ్మ అంటే మాఅమ్మ తల్లి అన్నమాట. ఆజబ్బులో అమ్మమ్మని క్రింద పెట్టే పరిస్థితి అయింది. అందరికీ టెలిగ్రాంలు కొట్టారు. మామయ్యగూడా వచ్చిన అందరితో పాటు ఆమెదగ్గరగా నుంచున్నాడు. అప్పుడు అమ్మమ్మ మామయ్యను దగ్గరకు పిలిచి "నువ్వు యిట్లా బ్రహ్మచారిలాగ ఎంతకాలం ఉంటావు నేనా వెళ్ళిపోతున్నాను. నీకుచేసే అడదిక్కూలేదు. పెళ్ళిచేసుకోవోతేమానె కనీసం చేసుకుంటానని మాటైనా అను సుఖంగా చచ్చిపోతాను" అని అన్నది. ఇక చేసేదిలేక మామయ్య "నీవు ఏమీ నావిషయంలో దిగులు పడకు అమ్మా. ఈసారి ఏ సంబంధం వచ్చినా తప్పకుండా పెళ్ళి చేసుకుంటాను" అని అన్నాడు అమ్మమ్మ చేతిలో చెయ్యివేస్తూ. తరువాత అమ్మమ్మకు దేవుడి దయ వల్లనో, డాక్టరు యిచ్చిన ఇంజెక్షన్ల వలననో రోగం వెనకబడి క్రమంగా ఆరోగ్యం వచ్చింది.

ఇది జరిగిన ఆరు నెలలకు తెనాలినుంచి ఒకాయన తనరెండో కూతురు పెళ్ళికి ఉందనీ, గుంటూరులో ఇంటరు మొదటి సంవత్సరం చదువుతోందనీ, ఏమీ అభ్యంతరం లేకపోతే అమ్మాయిని మీవాడికియిచ్చి పెండ్లిచేయటానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు మా తాతగారితో. ఈసారి తెనాలినుంచి ఒక సంబంధం వచ్చిందిరా అని చెప్పగానే మామయ్య "పిల్లను చూచిరండి" అని అన్నాడు బహుశా అమ్మమ్మతో తను చేసిన వాగ్దానం నిలుపుకోవాలని ఉద్దేశంతో. అమర్నాడే పిల్లనుచూచి రావడమూ, సంబంధం సెటిల్ చేసుకోని ముహూర్తం పెట్టుకోడమూ జరిగిపోయినయ్యి

ఈ సందర్భంలో ఒక ముఖ్య విషయం చెప్పక తప్పదు. రెండో పెళ్ళి చేసుకొనే విషయంలో మామయ్య కొన్ని నిబంధనలతో ఒక నియమావళి తయారుచేసి "వీటి అన్నిటికీ మీరు లోబడి ఉంటేనేగాని నేను పెళ్ళి చేసుకోను" అని అన్నాడు. ఆ నియమావళిలో ఉండేషరతులు (1) 5 ఏండ్లకు పైబడ్డ పెళ్లిగాని మగపిల్లలు పెండ్లికి రావడానికి వీల్లేదు (2) పెండ్లిముహూర్తసమయం రాత్రిపూట సరిగా 12 గంటలకు ఉండవలెను. (3) ముహూర్తసమయంలో మేళాలుగాని, బాజాబజంత్రీలుగాని ఉండటానికి వీల్లేదు. (కావాలంటే సన్నాయిమేళం చిన్నగా వాయించవచ్చు) (4) పెళ్లిలో ఊరేగింపు పనికిరాదు (5)పది మంది చుట్టాలకంటే (ఉభయ పక్షాలలోగూడా) ఎక్కువమంది పెండ్లికి రాకూడదు. (6) పెళ్లికి శుభలేఖలు పంచడముగాని, పెద్దవిందులు జరపడంగాని పనికిరాదు. అసలు పెండ్లి చేసుకుంటేనే చాలురా భగవంతుడా అని అనుకునేవారు ఈ నిబంధనలు సులభంగా ఒప్పుకున్నారంటే ఏమీ ఆశ్చర్యంలేదు. లేకపోతే పెండ్లి ఆగిపోతుందేమోనని వారిభయం.

పెండ్లి సలక్షణంగా తెనాలిలో ఒక పూరిగుడిసెలో (కన్యాదాతగారి స్వగృహంలెండి) అర్థరాత్రి 12 గంటలకు జరిగింది. మర్నాడే గృహప్రవేశానికి బెజవాడలో మా పిన్నిగారి యింటికి వెళ్ళారు. అందుచేత మా కొత్త అత్తగార్ని చూడడము అనే భాగ్యం నాకు కలుగలేదు. (నియమావళిలో మొదటి షరతు ప్రకారము) గుంటూరులో ఉండడంచేత.)

ఒకసారి దసరా సెలవల్లో మా క్రొత్త అత్త గారిని చూడాలని బెజవాడ వెళ్లాను. సుమారు వారంరోజులు అక్కడ మకాంవేసినా ఆమె పూర్తిస్వరూపం నాకు కనబడలేదు. కనిపెట్టుకు, కనిపెట్టుకు, కూర్చుంటే ఓవరికి ఆమె బావిదగ్గ ఱకు నీళ్లకోసం పోయేసమయంలోనో, బట్టలు ఉతకడానికి పోయేసమయంలోనో, ఆమె కాలో చెయ్యో కనపడేది దాంతో తాత్కాలికంగా సంతృప్తిపడి ఊరుకునేవాడ్ని. ఒక్కొక్కప్పుడు "బహుశా ఆమెకు నాముందుకు రావడానికి సిగ్గేమో? నేనేస్వయంగా పోయి పలకరిస్తే— ఛీ ఛీ! నామర్దాపని" అని నాలో నేను తర్కించుకునేవాడ్ని. ఇంకనాకు ఆమెస్వరూపం చూడడానికి ప్రాప్తంలేదు కాబోలు అని అనుకొని మర్నాడే గుంటూరుకు ప్రయాణం కట్టా.

కాలప్రవాహంలో రెండేళ్లుగడచి వెళ్లిపోయినయ్యి. ఈ రెండేళ్లనుంచి మా క్రొత్త అత్త గారి దర్శన భాగ్యం నాకు లభ్యపడలేదు ఒక రోజు పోస్టు జమాను ఒక ఉత్తరం ఇచ్చాడు. అది బెజవాడనుంచి మా తాతగారు వ్రాసింది, దాంట్లో మామయ్యకు కొడుకు పుట్టాడనీ బారసాలకి తప్పకుండా రావలసిందనీ వ్రాశారు.

బారసాలరోజున సరిగా ముహూర్తసమయానికి బెజవాడలోని వారింటికి జేరుకున్నాను. పెద్ద పందిరిలో, బంధుమిత్ర, పరిజన సహితంబుగా నుపవిష్టుండై పందిరిమధ్యంబున నొక్కచో పుత్ర సతీ సమేతుడై హోమంబు చేయుచుండె. ఇన్నాళ్లకు మా క్రొత్త అత్తగారి దర్శన భాగ్యం లభ్యమైనందులకు భగవంతునికి వేయి దణ్ణాలు పెట్టాను.

"ఏంమామయ్యా పెళ్లిచేసుకోనంటివికదా పిల్ల వాణ్ణి ఎట్లా పుట్టించావు" అని అడిగా బోజనాల ముందు,

"అరె! ఊరుకో ఇప్పుడు పెళ్ళాన్ని విడిచి పెట్టి పోగలడు" అన్నాడు మా తాతగారు వేళాకోళంగా.

పాపం మామయ్య నోరెత్తితే ఒట్టు సిగ్గుతో వంచిన తల ఎత్తకుండా భోజనం ముగించి లేచాడు.

## జోడా

### యం. వి. యస్. రావ్

కొత్తగా ప్రాక్టీసు పెట్టిన డాక్టర్ గారి భార్యవద్దకు ఇరుగింట్లో ఓ ప్లీడర్ గారి భార్య ఏదో కాలక్షేపానికి వచ్చింది - మాటల సందర్భంలో ప్లీడర్ గారి భార్య తన భర్త గొప్పతనాన్ని చెప్పడానికి......

ప్రాక్టీసుపెట్టి కొత్తలోనే మా ఆయన దక్కకుండా పోతుందేమో అన్న మా పుట్టింటివారి ఆస్థిని...కోర్టులో నాపేర గెల్చారు...

"మావాళ్ళ ఆస్థికూడా నాకలానే వచ్చింది" అని అంటుకుంది డాక్టర్ గారిభార్య-

"ఎలా......?"

"ఆస్థి ఎవరికి పోవలసి యుండెనో ఆయనకి మావాళ్ళే వైద్యం చేశారు..."